
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

శనివారం, 24 మే 2025



'యూటీ' పనుల్లో వేగం పెంచాలి



కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

- » ఎట్టి పరిస్థితుల్లోనూ జూలై 10 లోపు నీరివ్వాల్సిందే
- » అవసరమైతే రెండు షిఫ్టుల్లో పనిచేయండి
- » రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- » శాశ్వత మరమ్మతు పనుల ఆకస్మిక తనిఖీ

వివరాలు : 7లో

విద్వేష రాజకీయాలు ఇక్కడ చెల్లవ్



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- » ప్రజల సహకారంతోనే ఖమ్మం సంపూర్ణ అభివృద్ధి
- » రాష్ట్రంలోనే మోడల్ నగరంగా తీర్చిదిద్దుతాం
- » వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- » స్మార్ట్ వాటర్ డ్రైయిన్లకు శంకుస్థాపన

వివరాలు : 7లో

గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి జిల్లాలో కోట్లాది రూపాయల విలువైన అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లోపే వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అందుకు తగినట్టుగా యంత్రాంగం కూడా చర్యలు చేపట్టింది. కానీ ఆ అభివృద్ధి లక్ష్యాల పూర్తికి అకాల వానలు గండంగా మారాయి. దీనికి తోడు ఈ సారి జూన్, జూలైలోనే వర్షాలు పడే అవకాశాలున్నట్టు తెలుస్తుండటంతో పనుల పూర్తిపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.



మున్నేరుకు ఇరువైపులా నిర్మిస్తున్న వరద గోడల నిర్మాణ పనులు

అభివృద్ధికి వానగండం



ఖమ్మం మున్నేరుపై జరుగుతున్న తీగల వంతెన నిర్మాణ పనులు

అకాల వర్షాలకు నిలిచిపోతున్న పనులు

- » ఉమ్మడి జిల్లాలోని పలు రహదారులు, భవనాల నిర్మాణాలకు అడ్డంకులు
- » రాబోయే వానాకాలంపై మరింత ఆందోళన
- » ఈలోపే పూర్తి చేయాలన్న లక్ష్యంపై నీలినీడలు

ఖమ్మం, మే 23 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి జిల్లాలోని పలు అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులతో పాటు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఆదేశాలిస్తున్నా.. వానలతో ఆ పనులు చివరికి చేరుతాయా లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఆర్అండ్‌బీ, పీఆర్, ఇరిగేషన్‌తోపాటు పలు ప్రభుత్వ శాఖల నుంచి రూ.కోట్ల పనులు సాగుతున్నాయి. అయి తే రహదారులు, ఇతర నిర్మాణ పనులకు ఈ వర్షాలు మరింత అడ్డంకిగా మారే పరిస్థితి కనిపిస్తోంది.

ముమ్మరంగా పలు కీలక పనులు

ప్రస్తుతం ఉమ్మడిజిల్లాలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రధానంగా మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు భారీగా మంజూరవుతున్న నిధులతో చేపట్టిన పలు పనులు జోరుగా సాగుతున్నాయి. ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మునిసిపాలిటీల్లో కూడా రోడ్లు, డ్రెయినేజీల లాంటి పనులు కూడా ఉన్నాయి. 103కి.మీ. పొడవున రూ.2300కోట్లతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే ఆగస్టు 15నాటికి పనులను పూర్తి చేయాలని ఇటీవల మంత్రి

(మిగతా 6వ పేజీలో)

త్వరితగతిన భూ సేకరణ

పూర్తి చేయాలి

- » నిర్వాసితులకు నచ్చజెప్పాలి
- » పెండింగ్ భూ సేకరణపై అధికారులతో ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి



సమీక్షిస్తున్న ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పెండింగ్ భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్నేరు నదిపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్, సీతారామ ఎత్తిపోతల పథకం, జాతీయ రహదారుల నిర్మాణం వంటి వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులు, భూ నిర్వాసితులతో నేరుగా చర్చించి ఎలాంటి ఆందోళనలు జరగకుండా సానుకూల వాతావరణంలో భూసేకరణ ప్రక్రియ జరిగేలా చూడాలని అన్నారు.

సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా యాతాలకుంట టన్నెల్, పాలేరు రిజర్వాయర్ లింక్, డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టేందుకు పకడ్బందీగా కార్యాచరణ తయారు చేసుకోవాలన్నారు. రైతులకు పరిహారం అందించే అంశంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, చట్ట ప్రకారం పరిహారం మొత్తం రైతులకు అందేలా అధికారులు పనిచేయాలని అన్నారు. భూసేకరణ అంశంలో మానవీయ కోణంలో అధికారులు వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు జి.నర్సింహారావు, ఎల్.రాజేందర్ గౌడ్, నీటిపారుదలశాఖ అధికారులు, కలెక్టరేట్ భూ సేకరణ విభాగ అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటకలో సైబర్ నేరగాడి

అరెస్ట్

- » రూ.1.12 కోట్ల కేసులో పట్టుకున్న ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు



నేరస్థుడితో ఖమ్మం సైబర్ పోలీసులు

ఖమ్మం, మే 23 (ఆంధ్రజ్యోతి): మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడి రూ.1.12కోట్లు కొట్టేసిన కేసులో ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు కర్ణాటకకు చెందిన సైబర్ నేరగాడిని అరెస్ట్ చేసినట్టు సీపీ సునీల్‌దత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన రిటైర్ట్ ఉద్యోగి నాగుల బ్రహ్మంకు ఫోన్ చేసి ఆయన మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనీ బెదిరింపులకు పాల్పడ్డారు. ముంబయి పోలీసులమని చెబుతూ అరెస్ట్ చేస్తామని బెదిరించి డిజిటల్ అరెస్ట్ చేసి 2024 అక్టోబరులో పలు దఫాలుగా రూ.1.12 కోట్లు దోచుకున్నారు. కాగా దీనిపై (మిగతా 6వ పేజీలో)

ఊరి బడులకు జీవం!

- » పబ్లిక్, ఫౌండేషన్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు
- » పైలెట్ ప్రాజెక్టుగా మధిర నియోజకవర్గం
- » సీఎం, డిప్యూటీ సీఎం కృషితో ప్రభుత్వ విద్యకు మహర్దశ
- » దశాబ్దాల తరువాత నేరవేరనున్న సామాన్యుడి కల



తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా రూపుదిద్దుకోనున్న రావినూతల ఉన్నత పాఠశాల

బోనకల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు కార్పొరేట్ పాఠశాలల తాకిడి.. మరోవైపు పాలకుల నిర్లక్ష్యానికి గడిచిన దశాబ్ద కాలంగా ప్రభుత్వ పాఠశాలలు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయని, వాటిని తిరిగి గాడిలో పెట్టడం సాధ్యమేనా? అని మేధావులు, విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా పాఠశాలలు పట్టుమని పది మంది విద్యార్థులు కూడా లేక వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మరికొన్ని చోట్ల విద్యార్థులు లేక మూతపడుతున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువ, ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండటంతో వారిని సర్దుబాటు చేసిన ఘటనలున్నాయి. ప్రభుత్వ బడుల్లో పిల్లల సంఖ్య తగ్గడం, దీనికి తోడు డిజిటల్ విద్య కూడా సక్రమంగా అందడం లేదని పేద విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్ కోసం అప్పులు చేసి మరీ కార్పొరేట్ పాఠశాలలకు పంపుతున్నారు.

గాడిలో పెట్టేలా సర్కారు అడుగులు

గతంలో నిర్లక్ష్యానికి గురైన విద్యారంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సరికొత్త ఆలోచనలు చేశారు. ఇందులో భాగంగా ఊరి బడులకు జీవం పోసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో మొదటి విడతగా కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో పబ్లిక్, ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను పేద పిల్లలకు అందించేందుకు తగిన కార్యాచరణను రూపొందించే పనుల్లో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. రెండో విడతలో 19 నియోజకవర్గాల్లో కూడా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది.

నివేదిక ఇచ్చిన విద్యాకమిషన్ చైర్మన్

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఇప్పటికే విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి కొద్ది నెలల క్రితం మధిర నియోజకవర్గంలో పర్యటించారు. విద్యాశాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వ బడుల స్థితిగతులపై వివరాలను సేకరించి నివేదికను ప్రభుత్వానికి అందించారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠం చేయడంతో పాటు పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యా విధానంలో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాఠశాలల మార్పు ఉండబోతోందిలా..

బోనకల్ మండలంలో పది ఉన్నత, 33 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో 1,722 మంది విద్యార్థులు చదువుతున్నారు. కొత్త విధానంలో మండలంలో మూడు చోట్ల తెలంగాణ పబ్లిక్ సూళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా రావినూతల, చిరునోముల, కలకోట గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలను గుర్తించారు. రావినూతలలో ఏర్పాటు చేసే పబ్లిక్ స్కూల్‌కు ఆ గ్రామంతో పాటు జానకీపురం, గోవిందాపురం(ఎల్) గ్రామాల విద్యార్థులు వస్తారు. చిరునోముల పబ్లిక్ స్కూల్‌కు ఆ గ్రామంతో పాటు బోనకల్, ముష్టికుంట్ల గ్రామాల విద్యార్థులు, కలకోట పబ్లిక్ స్కూల్‌కు ఆ గ్రామంతో పాటు ఆళ్లపాడు, బ్రాహ్మణపల్లి, మోటమర్రి గ్రామాల విద్యార్థులు వస్తారు. మండలంలో ఏర్పాటు చేయనున్న మూడు పబ్లిక్ పాఠశాలల్లో 4వ తరగతి నుంచి 10వతరగతి వరకు

(మిగతా 6వ పేజీలో)


ముగ్గు దశలోనే ఆగిన ఇంటి నిర్మాణం

కొలతల్లో తికమక.. లబ్ధిదారుల్లో ఆందోళన

- ఇళ్ల విస్తీర్ణంపై గందరగోళం
- క్షేత్రస్థాయిలో కనిపించని టెక్నికల్ అధికారులు
- చంద్రుగొండ మండలంలో ముగ్గు దశలోనే ఆగిన పలు ఇందిరమ్మ నిర్మాణాలు

చంద్రుగొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వేలపై సర్వేల అనంతరం ఇళ్లకోసం ఎదురుచూస్తున్న ప్రజలను ఆందోళనకు గురిచేసిన అధికారులు చంద్రుగొండ మండలంలో పెద్దగా వివాదాలు లేకుండా లబ్ధిదారుల ఎంపికనైతే ముగించారు. అనంతరం గ్రామ కార్యదర్శులు ఇంటి నిర్మాణానికి ముగ్గులు పోయించి లబ్ధిదారులను ఫొటోలు తీసి ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడు చేసి నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నారు. అయితే పక్షంరోజులైనా ఇళ్ల నిర్మాణం ప్రారంభం కావటంలేదు. దీనికి కారణం ఇంటి సైజు (కొలతలు) ఎంత పెట్టాలి, ఎక్కడి నుంచి ఎక్కడకు కొలవాలని, మొదటి బిల్లుకు బేస్‌మెంట్ పూర్తి చేయాలనే నిబంధన ఉంది. అంటే ఏ దశవరకు కట్టాలి అనే స్పష్టత లబ్ధిదారులకు లేకపోవటంతో నిర్మాణాలు ప్రారంభించటం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి లబ్ధిదారులకు కొలతల వివరాలు తెలపాల్సిన టెక్నికల్ అధికారులు ఇంతవరకు జాడలేరు. కొలతల్లో తేడా వస్తే బిల్లు రాదనే ఆందోళన లబ్ధిదారుల్లో నెలకొంది.

ఉత్సాహం చూపని లబ్ధిదారులు.

లబ్ధిదారుల ఎంపిక సమయంలో ఎంతో ఆత్రుతగా ఎదురు చూసి, ఇళ్లు మంజూరు కాగానే ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ఉత్సాహం చూపటంలేదు. ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిన బెండాలపాడు గ్రామానికి 310 ఇళ్లు మంజూరయ్యాయి. మార్చి మొదటివారంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజచేసి ప్రారంభించారు. ఇప్పటికి దాదాపు మూడు నెలలు కావస్తున్నా.. 121 మంది లబ్ధిదారులు నిర్మాణాలను ప్రారంభించారు. అందులోను 65ఇళ్లు మాత్రమే పునాదులు పూర్తయ్యాయి. ఇంకా 189మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదు. ఇవి కాకుండా మండలంలోని 13గ్రామ పంచాయతీల పరిధిలో మరో 680 ఇళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణం ప్రారంభం కాలేదు.

ఆర్థిక పరిస్థితులే కారణం..

పునాదుల వరకు నిర్మాణం చేస్తేనే తొలిదశ బిల్లు చెల్లింపులు చేసే నిబంధన ఉంది. దాంతో అత్యధిక లబ్ధిదారుల్లో పునాదుల వరకు నిర్మించే ఆర్థిక స్తోమత లేక నిర్మాణాలు చేపట్టలేదని పలువురు తెలిపారు. పునాదుల నిర్మాణానికి నగదు కాకపోయినా సిమెంట్, ఇనుము, ఇసుక, ఇటుక అందచేస్తే నిర్మాణాలు ప్రారంభిస్తామని పలువురు లబ్ధిదారులు తెలిపారు.

ప్రయాణికుల ఆరోగ్య రక్షణలో.. ఆర్టీసీ

- దాతల సహకారంతో కల్లూరు బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ
- అందుబాటులో ఓఆర్ఎస్, చల్లని తాగునీరు
- సత్తుపల్లి డీఎం, సిబ్బంది చొరవతో రాష్ట్రంలోనే ఆదర్శంగా..
- నాలుగేళ్లుగా కొనసాగుతున్న కార్యక్రమం

కల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు రవాణా సేవలందించడమే కాదు.. వారి ఆరోగ్య రక్షణపైనా దృష్టిపెడుతోంది ఆర్టీసీ. ఈ క్రమంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా వేసవిలో మూడు నెలలపాటు కల్లూరు బస్టాండులో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తోంది. అలాగే ప్రయాణికులకు ఓఆర్ఎస్, చల్లని తాగునీటిని అందుబాటులో ఉంచుతోంది.


మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి

సుమారు నాలుగేళ్లుగా సాగుతున్న కార్యక్రమం ఈ ఏడాది కూడా ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరాం, సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, ఆర్టీసీ సిబ్బంది చూపిన చొరవతో విజయవంతంగా సాగుతోంది. ప్రతీ ఏడాది వేసవిలో మూడు నెలల పాటు ప్రయాణికులు వడదెబ్బకు గురికాకుండా ఉండాలన్న సంకల్పంతో మజ్జిగ అందజేస్తున్నారు. అలాగే ఓఆర్ఎస్, చల్లని తాగునీటిని కూడా ఉంచుతున్నారు. కల్లూరు బస్టాండు పరిధిలో రూట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కిన్నెర ఆనందరావు తన వంతుగా ఓ మొబైల్ ఫోన్లో ప్రముఖుల, దాతల, ప్రయాణికుల అందరి సెల్ నెంబర్లను సేకరించి ఓ గ్రూపు ఏర్పాటు చేశాడు. ఆ ప్రయత్నంలోనే సత్తుపల్లి డిపో ద్వారా కల్లూరు ప్రాంతం మీదుగా వెళ్లే బస్సు సమయాల వివరాలను తెలియపరచటమే కాకుండా, ఇలా ఆర్టీసీ తరుపున అందిస్తున్న సేవల గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ సంస్థపై ప్రజల్లో గౌరవం కలిగేలా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది దాతలు తమ, తమవారి వివాహ వేడుకలు, వివాహ వార్షికోత్సవాలు, పుట్టిన రోజు, ఇతర కార్యక్రమాల సందర్భంగా కల్లూరు ఆర్టీసీ బస్టాండులో సగటున నిత్యం 400నుంచి 500 మంది ప్రయాణికులకు మజ్జిగ పంపిణీతో పాటుగా ఓఆర్ఎస్, మినరల్ వాటర్ అందుబాటులో ఉంచుతున్నారు. ఇలా మజ్జిగ పంపిణీ చేసే దాతలు ఒక రోజు ముందుగా బస్టాండులో అందుబాటులో ఉంచిన డైరీలో తమ వివరాలు రాసి వెళతారు. దాతల చేయూతతో ఆర్టీసీ అందిస్తున్న ఈ సేవలను అందుకుంటున్న ప్రయాణికులు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, దాతలకు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.


ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న ఖమ్మం ఆర్ఎం సరిరాం

దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ

కె.ఆనంద్, విలేజ్ రూట్ ఆఫీసర్, కల్లూరు.

దాతల సహకారంతోనే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా సాగిస్తున్నాం. నాలుగేళ్లుగా ఇక్కడ ఇది ఆనవాయితీగా వస్తోంది. ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరాం, డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి కూడా ఎంతగానో సహకరిస్తున్నారు. వేసవిలో ప్రయాణికులు, సిబ్బంది ఇబ్బందులు గురికాకుండా మజ్జిగ, ఓఆర్ఎస్, చల్లని తాగునీటిని కూడా అందుబాటులో ఉంచుతున్నాం.

గిరిజన యువత అన్నిరంగాల్లో ముందుండాలి..

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో నివసించే యువత అన్నిరంగాల్లో ముందుండాలని ఎస్పీ రోహిత్‌రాజు పిలుపునిచ్చారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాలు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు, మైదాన ప్రాంతాల్లో వలస గిరిజన యువతకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని కొండరెడ్ల గ్రామమైన పూసుకుంటలో ఉండే 12మంది యువకులకు ఎస్పీ చేతుల మీదుగా డ్రైవింగ్ లైసెన్సులను ఇప్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువతకు పోలీస్‌శాఖ అన్నిరకాలుగా అండగా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువతకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్సులను ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.


లైసెన్సులు అందుకున్న యువతతో ఎస్పీ

నకిలీ విత్తనాలను అరికట్టాలి

- విత్తన చట్టాలను పాటించాలి: భద్రాద్రి కలెక్టర్
- టాస్క్‌ఫోర్స్, ఎరువులు, పురుగు మందుల డీలర్లకు అవగాహన సదస్సు

కొత్తగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుందని ఈ సీజన్‌లో నకిలీ విత్తనాలను అరికట్టాలని, విత్తన చట్టాలను పాటించి మంచి విత్తనాలను రైతులకు అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. శుక్రవారం కొత్తగూడెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు, ఎరువులు, పురుగుమందుల డీలర్లకు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో డీలర్లు పాటించాల్సిన విధి విధానాలు, విత్తన చట్టం -1966, విత్తన నియంత్రణ చట్టం 1983, విత్తన రూల్స్ 1968, ఈసీ యాక్టు 1983, ఈపీ యాక్టు 1968 వివిధ చట్టాలను అనుసరించి విత్తనాల అమ్మకంలో పాటించాల్సిన జాగ్రత్తలను జిల్లా కలెక్టర్ వివరించారు. వారికి అవగాహణ కల్పించారు. రైతులు విత్తనాలు తీసుకున్న వారికి బిల్లులపై సంతకం చేసి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని డీలర్లను ఆదేశించారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగినట్లయితే వారిపై చట్టరీత్య కఠిన చర్యలు, పీడీ యాక్టు కేసులు పెడతామని హెచ్చరించారు. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు, ఇంటర్నల్ స్క్వాడ్, సంబంధిత మండల క్వాలిటీ ఇన్‌స్పెక్టర్, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ వ్యవసాయ శాఖాధికారులు టాస్క్‌ఫోర్స్ కమిటీలు కలిసి సంయుక్త ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వాటిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు ఆయా పురుగుమందులు, విత్తనాల షాపులపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కే.వేణుగోపాల్, జిల్లా అధికారి పీడీ విద్యాచందన, కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, డీసీవో ఖుర్షీద్, డీహెచ్ఎస్‌వో కిషోర, డీఏవో వి.బాబురావు, వివిధ జిల్లా అధికారులు, డివిజన్ ఏడీఏ, తహసీల్దార్లు, ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

నేటి మెగా జాబ్‌మేళాకు విస్తృత ఏర్పాట్లు

ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైరా/ఏన్కూరు/కారేపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): వైరాలో శనివారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు విస్తృత ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ జాబ్‌మేళాను ప్రారంభించనున్నారు. గత వారంరోజుల నుంచి ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఈ జాబ్‌మేళాను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు. స్థానిక జాతీయ ప్రధాన రహదారి పక్కనున్న వైరా ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో జాబ్‌మేళా, వసతి, వంట వార్పు ఏర్పాట్లను చేశారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ స్వయంగా ఈ మూడు విద్యాలయాల్లో కలియతిరిగి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయా కంపెనీల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఇంకా చేయాల్సిన ఏర్పాట్లపై మునిసిపల్, ఆర్అండ్‌బీ ఇతర అధికారులకు ఎమ్మెల్యే పలు ఆదేశాలు జారీ చేశారు. దాదాపు 90కిపైగా కంపెనీలు ఈ జాబ్‌మేళాకు తరలిరానున్నాయి. ఐదువేల పైచిలుకు మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ఈ మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 6500మంది నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తెలిపారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

మొత్తంగా పదివేలమంది నిరుద్యోగులు జాబ్‌మేళాకు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. మెగా జాబ్‌మేళా కోసం నియోజకవర్గస్థాయిలో మునిసిపాలిటీ, మండలాల వారీగా అధికారులు, అన్నిశాఖల ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించి గ్రామగ్రామాన వాల్‌పోస్టర్లు, మైకుల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రత్యేక వేదిక పైనుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ జాబ్‌మేళాను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

ఏన్కూరు, జూలూరుపాడు, కొణిజర్ల, కారేపల్లి మండలాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి పెద్దఎత్తున నిరుద్యోగులను జాబ్‌మేళాకు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి మండలం నుంచి 3,4 బస్సుల ద్వారా నిరుద్యోగులను తరలించేందుకు అధికారులను ఆదేశించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారికి రవాణ సౌకర్యంతోపాటు భోజన వసతి కలిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కారేపల్లి మండల తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్‌తోపాటు మండల కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

‘అభివృద్ధి’కి వానగండం!

(5వ పేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. అయితే ఈ రహదారిలో కొన్నిచోట్ల నాలుగు లైన్ల పనులు పూర్తియినా కొన్నిచోట్ల బ్రిడ్జీలు, అండర పాస్‌లు, ఫ్లై ఓవర్లు, ఎగ్జిట్ లాంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సాగర్ కాలువ క్రాసింగ్‌తో పాటు ఖమ్మంలోని ధంసలాపురం రైల్వేక్రాసింగ్ బ్రిడ్జి, ఎగ్జిట్‌బ్రిడ్జి, ఎగ్జిట్ నిర్మాణం, హైటెన్షన్ వైర్లు లాంటి పనులు కీలకంగా ఉన్నాయి. వర్షాకాలంలో ఈ పనులకు అంతరాయం కలిగితే ఇవన్నీ మరిన్ని ఆలస్యమమ్యే అవకాశం ఉంది. విజయవాడ-నాగపూర్‌కు సంబంధించి ఖమ్మంజిల్లాలో రూ.2800కోట్లతో 77కి.మీ పొడవున రహదారి పనులు జరుగుతున్నాయి. చింతకాని, ఎర్రుపాలెం, తదితర మండలాల్లో పనులు ప్రారంభించారు. వర్షాకాలంలో ఈ రోడ్ల నిర్మాణ పనులు పూర్తిగా నిలిచే పరిస్థితి ఉంది. ఖమ్మం- రూ.30కోట్లతో కురవి రహదారి పనులు జరుగుతున్నాయి. వర్షాలు పడితే వీటికి కూడా అంతరాయం ఏర్పడనుంది. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో సుమారు రూ.500కోట్లతో అండర్ డ్రెయినేజీ పనులతో పాటు సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయి. అలాగే ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మున్నేరుకు ఇరువైపులా సుమారు రూ.690కోట్లతో 17కిమీ. వరద నివారణ గోడల నిర్మాణపనులు జరుగుతున్నాయి. గోడల వెంటనే మురికి నీరు వెళ్లేందుకు డ్రెయినేజీ పనులు కూడా చేపట్టాలి. అయితే ప్రస్తుతం పనులు జరుగుతున్నా వర్షాలు పడినప్పుడు ఆటంకం కలుగుతుంది. వర్షాలతో పనులన్నీ పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది. మున్నేరుపై రూ.186కోట్లతో ఆర్అండ్‌బీ తీగల బ్రిడ్జి పనులు చేస్తున్నారు. మున్నేరుకు వరద వస్తే ఈ పనులకు ఆటంకమే. అలాగే ఖమ్మంలో రూ.130కోట్లతో మెడికల్ కళాశాల భవన పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహించాలన్న లక్ష్యంతో పనులు నిర్వహిస్తున్నారు అయితే వర్షాకాలం వస్తే ఆ పనులకు కొంత అంతరాయం కలగనుంది.


ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు

ముగ్గురు మంత్రుల కృషితో..

జిల్లాలో మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఖమ్మంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరులో రెవన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషితో ఉమ్మడి జిల్లాలో ఆర్అండ్‌బీ, పీఆర్, మునిసిపాలిటీకి సంబంధించిన పలు రహదారులకు నిధులు మంజూరయ్యాయి. మధిరలో కూడా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే అడపాదడపా పడుతున్న వర్షాలతో పనులకు ఇబ్బందులు ఎదురవుతుండగా పూర్తిస్థాయి వర్షాలు వస్తే బురద నీరు, వరద పనులకు కష్టకాలం రానుంది. అటు భద్రాద్రి కొత్తగూడెం.. ఇటు ఖమ్మం రెండు జిల్లాల్లో కొన్నిచోట్ల ఆర్అండ్‌బీ రహదారుల పనులు పంచాయతీరాజ్, ఇరిగేషన్ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. ప్రధానంగా సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పాలేరు లింక్‌కెనాల్ పనులతోపాటు సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులు ముమ్మరంగా జరుగుతుండగా.. వానాకాలం వస్తే వీటికి బ్రేక్ పడే అవకాశాలున్నాయి. అలాగే ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పనులు చేపట్టబోతున్నారు. ఇప్పటికే సగం ఇళ్లకు మంజూరు లభించగా.. వర్షాకాలంలో ముగ్గులు పోయడం, నిర్మాణాలకు అవరోధం కలగనుంది..

పకడ్బందీగా నిర్వహిస్తేనే ముందుకు

వాస్తవానికి జూన్ వరకు అభివృద్ధి పనులను నిరాటంకంగా పనులు నిర్వహించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ప్రస్తుతం రోజూ పడుతున్న అకాల వర్షాలతో వారి లక్ష్యం నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. పకడ్బందీ ప్రణాళికలతో వానాకాలం పూర్తిస్థాయిలో రాకముందే రోజువారీ పనులను చేపడితే కొంతవరకు పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం వచ్చే లోపు అధిక శాతం పనులను పూర్తి చేసేలా అధికారులు.. కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి సూచనలు ఇవ్వాల్సి ఉంది. ఇక భవనాలైతే.. స్లాబులు వేసే పనులు పూర్తి చేస్తే వర్షాకాలమైనా సరే లోపల పనులను పూర్తి చేసే అవకాశం ఉంటుంది.


నిర్మాణంలో మెడికల్ కళాశాల భవనాలు

ఎన్‌కౌంటర్ల పేరుతో జరుగుతున్న

నరమేధాన్ని ఆపాలి

- వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదుల కొవ్వొత్తుల ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీల ప్రాణాలను తీస్తూ ఎన్‌కౌంటర్లుగా ప్రచారం చేస్తుందని పలువురు నాయకులు అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కాకి భాస్కర్, రవిమారుత్, డాక్టర్ గోపీనాథ్, దేవిరెడ్డి విజయ్, నున్నా నాగేశ్వరరావు, దండి సురేశ్, గిరి మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ భూటకమని కొట్టి పారేశారు. విస్తారమైన అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే కుట్రలు కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కోటేశ్వరరావుతో పాటు మరో 26 మందిని పట్టుకొని కాల్చి చంపిన సంఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అడవుల నుంచి ఆదివాసీలను వెళ్లకొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపగాని శంకర్రరావు చిర్ర రవి, కిషన్‌నాయక్, స్వర్ణ సుబ్బారావు, డాక్టర్ యలమంచిలి రవీంద్రరావు, భారవి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీని ముమ్మరం చేయండి

నేలకొండపల్లి, మే23(ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీని ముమ్మరం చేయాలని, సరిహద్దుల నుంచి జరిగే అక్రమ రవాణాను అరికట్టటానికి కఠిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీసీపీ లాఅండ్‌ఆర్డర్ ప్రసాదరావు ఆదేశించారు. శుక్రవారం అడిషనల్ డీసీపీ నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ పోలీస్ సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. విచారణ నివేదికలు, సీసీటీవీ, జనరల్ డైరీ రికార్డులను పరిశీలించారు. డ్యూటీ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. మండలంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి? పాత నేరస్తుల కదలికలపై నిఘా పెడుతున్నారా, పాత నేరస్తుల నివాసాలను తనిఖీ చేస్తున్నారా, అంటూ ఎస్‌హెచ్‌ఓ పెంటరి సంతోష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ కేసుల్లో పట్టుకున్న వాహనాలను పరిశీలించారు.



పట్టుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ప్రసాదరావు

కర్ణాటకలో సైబర్ నేరగాడి అరెస్ట్

(5వ పేజీ తరువాయి)

కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి.. సదరు కేసులో రూ.32 లక్షలు మహ్మద్ జాఫర్ బెల్గాం అనే వ్యక్తి అకౌంట్లోకి వెళ్లినట్టుగా గుర్తించారు. అతడిని కర్ణాటకలోని హుబ్లీలో అరెస్ట్ చేసి నిందితుడిని సైబర్ క్రైం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన నిందితుడిని అరెస్ట్ చేసి ట్రాన్సిట్ వారెంట్ ద్వారా ఖమ్మం తీసుకొచ్చిన సైబర్ క్రైం డీఎస్పీ సీహెచ్, ఆర్‌వీ ఫణిందర్, ఎస్ఐ రంజిత్‌కుమార్, సహకరించిన ఎస్ఐ విజయ్‌కుమార్, సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఆయన అభినందించారు.

ఊరి బడులకు జీవం!

(5వ పేజీ తరువాయి)

డిజిటల్ విద్యను అన్ని ప్రమాణాలతో అందించనున్నారు. ఇదే తరహాలో ఎర్రుపాలెం మండలంలో జమలాపురం, బనిగండ్లపాడు, మీనవోలు ఉన్నత పాఠశాలల్లో, మధిర మండలంలో సిరిపురం, మహదేవపురం, మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, చింతకాని మండలంలో పందిళ్లపల్లి, లచ్చగూడెం, నాగులవంచ పాఠశాలల్లో, ముదిగొండ మండలంలో ముదిగొండ, ముత్తారం, పెద్దమండవ ఉన్నత పాఠశాలల్లో పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేసి వాటి సమీప పాఠశాలల విద్యార్థులందరికీ ఇక్కడ విద్యను అందించనున్నారు.

ముందస్తుగా సర్వే పనులు పూర్తి

తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్వహణ కోసం ఇప్పటికే గుర్తించిన పాఠశాలల్లో సర్వే పనులను పూర్తి చేశారు. ఫర్నిచర్, సౌకర్యాల కల్పనకు ముందస్తుగా ఒక్కో పాఠశాలకు 50లక్షల నిధులు అవసరమవుతాయని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది కొంత మేరకు పనులు పూర్తి చేసి 2026-27 విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు కొత్త బడుల్లో కార్పొరేట్ విద్యను అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెమీ రెసిడెన్షియల్ తరహా విద్యావిధానం అమల్లోకి రానుంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం చిరుతిండి అందించనున్నారు.

పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు తరువాత ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకుగాను ఫౌండేషన్ స్కూళ్లను కూడా ఏర్పాటు చేయనున్నారు. బోనకల్ మండలంలో పీఎస్ కలకోట(హెచ్‌డబ్ల్యూ), చిన్నబీరవల్లి, లక్ష్మీపురం, బోనకల్, ముష్టికుంట్ల ప్రాథమిక పాఠశాలల్లో ఫౌండేషన్ పాఠశాలల నిర్వహణకు గుర్తించారు. ప్రీ ప్రైమరీ నుంచి 3వ తరగతి వరకు ఇక్కడ విద్యను అందించనున్నారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా బస్ సౌకర్యం ద్వారా విద్యార్థులను పబ్లిక్, ఫౌండేషన్ పాఠశాలలకు చేర్చి నాణ్యమైన విద్యను అందించనుండటంతో సామన్యుడి కల నేరవేరనుంది.

గుండెపోటుతో వ్యక్తి మృతి

పాల్వంచ, మే 23 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత కొత్తగూడేనికి చెందిన కొండపల్లి శ్రీనివాస్(60) స్థానికంగా ఫంక్షన్లకు వంటపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే క్రమంలో సాయంత్రం పాల్వంచలో ఓ ఫంక్షన్‌లో వంట చేసి వస్తానని తన అక్కకు చెప్పి పాల్వంచ వచ్చాడు. గొల్లగూడెం ప్రాంతంలోని ఓ కిరాణా దుకాణం వద్ద నీళ్లు తాగుతూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి సెల్‌ఫోన్లోని నెంబర్ల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి సంఘటనా స్థలంలో అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మా మేనమామ గుండెపోటుతో మృతి చెందాడని, అతని మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని మేనల్లుడు ఎలమందల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

గ్యాస్ లీకై మంటలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని రోటరీనగర్‌లో శుక్రవారం గ్యాస్ లీకై మంటలు ఎగసిపడిన సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోటరీనగర్‌లోని ఓ నివాసంలో గ్యాస్ లీకై సిలిండర్ వద్ద మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు సిలిండర్‌ను బయటకు తీసుకువచ్చారు. మంటలు ఆర్పేందుకు ప్రత్నించగా సాధ్యపడకపోవడంతో, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

విద్వేష రాజకీయాలు ఇక్కడ చెల్లవ్

- ప్రజల సహకారంతోనే ఖమ్మం సంపూర్ణ అభివృద్ధి
- రాష్ట్రంలోనే మోడల్ నగరంగా తీర్చిదిద్దుతాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- స్మార్ట్ వాటర్ డ్రెయిన్లకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల, మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్వేష రాజకీయాలు ఇక్కడ చెల్లవని, కులాలు మతాల మధ్య గొడవలు పెట్టి.. పబ్బం గడుపుకోవాలనుకునే వారి పట్ల చైతన్యవంతమైన ఖమ్మం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం 2వ డివిజన్ పాండురంగాపురంలో రూ.1కోటితో నిర్మించనున్న స్మార్ట్ వాటర్ డ్రెయినేజీ పనులకు ఆయన మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి శంకుస్థాపన చేశారు. తొలుత స్థానిక కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి తుమ్మలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజలు సోదరభావంతో మెలగాలని, తన వంతుగా అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రశాంతమైన, ఆదర్శవంతమైన ఖమ్మం జిల్లా నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. గతంలో పాండురంగాపురం అంటే ఖమ్మానికి దూరంగా ఉండే ఒక ప్రాంతంగా ఉండేదని, నగరం అభివృద్ధి చెందటంతో పాటుగా విలీన డివిజన్‌గా గుర్తించి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. విలీన ప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ జరిగిందన్నారు. ప్రత్యేక నిధులు ఖమ్మం నగర పాలక సంస్థ బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయన్నారు. నిరుపేదలు, నిరాశ్రయులు అధికంగా ఉన్న ప్రాంతాలకు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం కేటాయింపులు ఎక్కువ జరపాలని అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణం నుంచి అండర్ డ్రెయినేజీల వరకు ప్రజలను ఒప్పించి వారి సహకారంతోనే భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి కార్యాచరణ జరుగుతుందన్నారు. ఖమ్మం నగరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అండర్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రజలు సహకరించాలన్నారు. వానాకాలం లోపు అండర్ డ్రెయినేజీ నిర్మాణానికి కావాల్సిన పనులు అధికారులు చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్ 50ఏళ్లను దృష్టిలో పెట్టుకొని ఖమ్మం అభివృద్ధి కార్యాచరణ జరుగుతోందన్నారు. ఖమ్మం నగరానికి చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయని, రైల్వే కెనెక్టివిటీ ఉందని, మంచి విద్యా, వైద్య హబ్‌గా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఖమ్మానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అయితే ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ గతేడాది భారీ వర్షాలతో మైదాన ప్రాంతంలోని డివిజన్లు ముంపునకు గురైతే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకొని రూ.250కోట్లు మంజూరు చేయించి అండర్ డ్రెయినేజీ పనులు చేపట్టారని గుర్తు చేశారు. అభివృద్ధి అంటే తుమ్మల.. తుమ్మలంటే అభివృద్ధి అని ఆమె అనడంతో సభకు వచ్చిన వారు చప్పట్లు కొట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, దుద్దుకూరి సైదులు, పల్లెబోయిన భారతి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఈఈ కృష్ణలాల్, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ యూటీ పనుల్లో వేగం పెంచాలి

- ఎట్టి పరిస్థితుల్లో జూలై 10లోపు నీరివ్వాల్సిందే
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, మే 23 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఎడమకాలువ అండర్ టన్నెల్ (యూటీ) పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఐబీ అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులను త్వరితగతిన పూర్తిచేసి జూలై 10 నాటికి సాగర్ జలాలు అందించాలని ఆదేశించారు. గతేడాది సెప్టెంబరు 1న పాలేరు వరదల కారణంగా ఎడమ కాలువకు పలు చోట్ల గండ్లు పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చేపట్టిన శాశ్వత మరమ్మతు పనులను మంత్రి పొంగులేటి శుక్రవారం మల్లాయిగూడెం వద్ద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐబీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గండ్లు పడిన సమయంలో కొట్టుకపోయిన అండర్ టన్నెల్ పనులను రైతులు ఇబ్బందులు పడకుండా తాత్కాలిక పనులు చేసి సాగర్‌నీరు అందించినట్టు వివరించారు. శాశ్వత ప్రాతిపదికన రూ.14.20కోట్లతో యూటీ కాల్వ, లైనింగ్ పనులు, కాల్వల మరమ్మతులు ప్రారంభించామన్నారు. ఖమ్మం జిల్లాకు సాగునీటి వనరైనందున మరమ్మతులు సకాలంలో పూర్తి చేసి రైతులకు వచ్చే వానాకాలం నాటికి నీరందిస్తామని పేర్కొన్నారు. ఖమ్మంజిల్లాలో ఆయకట్టు పరిధిలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు నీరందుతుందని తెలిపారు. వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యంత ప్రాధాన్యతాక్రమంలో అవసరమైతే రోజుకు రెండు షిఫ్టుల క్రమంలో పనిచేసి గడువులోగా నిర్మాణ పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్, అధికారులను మంత్రి ఆదేశించారు. ఆయన వెంట ఐబీ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, డీఈ బానాల రమేష్‌రెడ్డి, తదితరులున్నారు. అనంతరం మంత్రి పొంగులేటి పాలేరు గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందించారు. జీళ్లచెరువు గ్రామంలో ఓ వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



రాధమ్మ(ఫైల్)

జూలూరుపాడు, మే 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన వైరా మండలం విప్పలమడక గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన జూలూరుపాడు సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం భార్య చీమలపాటి రాధమ్మ(50) తల్లి ఈ నెల 21న మృతి చెందడంతో భర్తతో కలసి ఆమె మధిర మండలం జాలిముడి గ్రామానికి వెళ్లారు. తల్లి అంత్యక్రియలు ముగిసిన తర్వాత గురువారం సాయంత్రం ఆమె భర్త భిక్షంతో కలసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా, వైరా మండలం విప్పలమడక గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం మృతి చెందింది.

విద్యుదాఘాతంతో ట్రాక్టర్ డ్రైవర్..



బలరాం(ఫైల్)

తల్లాడ, మే23(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈసంఘటన శుక్రవారం మండలంలోని మల్లవరం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కొమ్మగిరి బలరాం(42) మృతిచెందాడు స్థానిక చికెన్‌షాపు వద్ద ఎర్త్‌వైర్ షాక్ సర్క్యూట్ కావడంతో బలరాం అక్కడికక్కడే మృతిచెందాడు. బలరాంకుభార్య, ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. భార్య సుశీల ఫిర్యాదుమేరకు తల్లాడ ఏఎస్ఐ జేవీయర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత



రామిరెడ్డి(ఫైల్)

అశ్వాపురం, మే23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన బలుగూరి రామిరెడ్డి (75) మృతదేహన్ని ఆయన కుటుంబసభ్యులు శుక్రవారం కొత్తగూడెం మెడికల్ కాలేజీకి అప్పగించారు. సీతారాంపురం గ్రామానికి చెందిన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బలుగూరి మధుసూదన్‌రెడ్డి తండ్రి రామిరెడ్డి గురువారం మృతి చెందారు. అయితే అతని మృతదేహాన్ని ఖననం చేయకుండా వైద్యపరిశోధనల నిమిత్తం మెడికల్ కాలేజీ విద్యార్థులకు తనతండ్రి పార్థీవదేహం ఉపయోగపడాలన్న ఉద్దేశ్యంతో కుమారుడు మధుసూదన్‌రెడ్డి మెడికల్ కాలేజీకి అగ్రిమెంట్ చేయించారు. కాగా మధు,కుటుంబసభ్యుల నిర్ణయాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు రాజారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మాచారి,ఏజే.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ నరికివేతపై ఫిర్యాదు

అశ్వాపురం, మే23(ఆంధ్రజ్యోతి): అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని తుమ్మలచెరువు బీట్‌లో గల పాలవాగు సమీపంలో ప్లాంటేషన్ నరికివేతకు సంబంధించి ఫారెస్ట్ అధికారులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తుమ్మలచెరువు బీట్‌లోని కుర్నాపల్లి కొత్తూరుకు చెందిన కొందరు గిరిజనులు గత రెండు రోజులుగా ఫారెస్ట్ అధికారులు నిర్ణయించిన కందకాలు దాటి ప్లాంటేషన్‌లోని చెట్లను నరికివేతకు పాల్పడుతుండా ఫారెస్ట్ సిబ్బంది రెవెన్యూ, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహసీల్దార్ రాజారావు, ఎస్ఐ మధుప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని గిరిజనులతో మాట్లాడారు. పోడుకు పాల్పడవద్దని సూచించారు. అనంతరం ప్లాంటేషన్ నరికివేతకు పాల్పడిన వారిని ఫారెస్ట్ సిబ్బంది ఫిర్యాదు మేరకు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్.రమేష్, మణుగూరు సబ్‌డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.



పోడుదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజారావు

విద్యారంగంలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ విద్యారంగాన్ని నిలబెట్టడంలో కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యాశిక్షణా కేంద్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు పాఠశాల నాయకులుగా, ఉపాధ్యాయులకు అకాడమిక్ మార్గదర్శకత్వం వహిస్తూ విద్యార్థిని, విద్యార్థుల పట్ల సానుకూల దృక్పథంతో ఉంటూ నాణ్యమైన విద్యను పిల్లలకి అందించడంలో నిజమైన నాయకులుగా ఎదగాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో సమాజ భాగస్వామ్యం పెంచుతూ పిల్లలకు నాణ్యమైన విద్య ను అందించడంలో తమ పాత్ర పోషించాలని కోరా రు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత పాల్వంచలో జరుగుతున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించి మనుషుల నివాసానికి అనుకూలమైన ఈ భూగ్రహాన్ని రక్షించడంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. జీవశాస్త్రం చదవడం అంటే కేవలం డాక్టర్‌గా స్థిరపడటం అనే ఒక అపోహ నుంచి బయటపడి ఎన్నో వినూత్నమైన కోర్సులను అధ్యయనం చేస్తూ మానవాళికి అవసరమైన సహజ సిద్ధమైన ఆహార పదార్థాలను మొక్కల ద్వారా అందించడం ఒక ప్రధాన బాధ్యతగా తీసుకోవాలని కోరారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో వినియోగించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎ. నాగరాజశేఖర్, జీవశాస్త్ర శిక్షణ కేంద్ర ఇన్‌చార్జి ఎ. పద్మలత, రాష్ట్ర పరిశీలకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



నిర్మాణంలో కూల్చివేస్తున్న దృశ్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 23(ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలపై ఖమ్మం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు కొరడా ఝుళిపించారు. బుర్హన్‌పురం రోడ్డు నెంబర్-7లో నిబంధనలు అతిక్రమించి నిర్మాణం జరుగుతున్న భవనాన్ని డీఆర్‌ఎఫ్ బృందాలు సమూలంగా కూల్చివేశాయి. ఐదు ఫ్లోర్‌ల వరకు అనుమతి తీసుకొని ఆరో ఫ్లోర్‌లో అదనపు నిర్మాణాన్ని చేపట్టడంపై స్థానికులు కేఎంసీ అధికారులకు ఇటీవల ఫిర్యాదులు చేశారు. దీంతో డీఆర్‌ఎఫ్ బృందం, పట్టణ ప్రణాళిక అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. అదనపు నిర్మాణాన్ని కూల్చివేశారు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు జరిపితే కూల్చివేసి కేసులు నమోదు చేయిస్తామని పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర హెచ్చరించారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు సంతోష్, తేజస్వీని, శశికుమార్, దుర్గసాయి, ప్రవీణ్, దివ్య, డీఆర్‌ఎఫ్ బృందం ఉన్నారు. కాగా గత రెండు నెలలుగా ఖమ్మం పట్టణ ప్రణాళిక అధికారులు అక్రమ భవన నిర్మాణాలపై స్పందించడం లేదని ఆరోపణలు రావడంతో శుక్రవారం కదలిక వచ్చినట్లు తెలుస్తోంది. ఇలానే అక్రమ కట్టడాలను కూల్చివేతలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నగల దుకాణంలో దొంగతనం

- రూ.12 లక్షల బంగారు ఆభరణాల చోరీ
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ



సీసీ కెమెరాలో రికార్డయిన దుండగుడి చిత్రం

మణుగూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని అశోక్ నగర్ ప్రాంతంలో ఉన్న శ్రీవారి జ్యువెలరీ షాపులో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఓ దొంగ రూ.12 లక్షల పై చిలుకు విలువ చేసే బంగారు ఆభరణాలను దొంగిలించుకెళ్లాడు. షాపు యజమాని దేవతా శ్రీనివాస్ ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి, ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వర్లులు సంఘటనా స్థలానికి చేరుకుని సమాచారం సేకరించారు. షాపులో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. మధ్యాహ్న సమయంలో షాపు యజమాని అతని భార్య భోజనానికి వెళ్లిన సమయంలో షాపులో బ్లాక్ మాస్క్ రెడ్ టీషర్టు ధరించిన ఓ వ్యక్తి వచ్చి వెండి వస్తువులను చూపించమని అడుగగా, అందులో పనిచేసే మహిళ పక్కన ఉన్న వెండి అభరణాలను తీసుకురావడానికి పక్కకు వెళ్లింది. ఈక్రమంలో కౌంటర్ పక్కనే డెస్క్‌లోపల ఉంచిన 130 గ్రాముల బంగారు వస్తువులను ఆ దొంగ అపహరించాడు. షాపులోకి బేరం వచ్చిందని సదరు పనిచేసే మహిళ దుకాణం పైనే నివాసం ఉండే యజమానురాలికి ఫోన్ చేయగా ఆమె వచ్చిన తర్వాత అడ్వాన్స్ రూ. 500 ఇస్తానని తమ ఇంటి వాళ్లు సాయంత్రం వచ్చి వెండి వస్తువులను కొనుగోలు చేస్తారని షాపు విస్టింగ్ కార్డుకూడా తీసుకున్నాడు. అంటే కాకుండా కరోనా వస్తోంది మాస్క్‌లు ధరించండి అంటూ నమ్మకమైన మాటలతో బురిడి కొట్టించి బంగారు నగలతో పారిపోయాడు. సీసీ ఫుటేజి చూసే సరికి వెండి వస్తువులను తీసుకు వద్దామని షాపులో పనిచేసే మహిళా ర్యాక్‌ల వైపునకు వెళ్లగా కౌంటర్ పక్కన ఉన్న బంగారు ఆభరణాలను దొంగ దొంగిలించి తన వెంట తెచ్చుకున్న సంచిలో వేసుకుంటున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. వీటి ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.



సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

గ్రానైట్, టైల్స్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

- అధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా రామభద్రయ్య



తెడ్డు రమేష్



రామ భద్రయ్య



శ్రీకాంత్

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 23(ఆంధ్రజ్యోతి): ది ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ టైల్స్ యజమానుల సంఘం(2025-27 సంవత్సరానికి సంబంధించి) ఎన్నిక ఏకగ్రీవం అయిందని ఎన్నికల అధికారి బుగ్గవీటి శ్రీధర్ శుక్రవారం తెలిపారు. 23వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం అభ్యర్థులు ఎవరూ వారి నామినేషన్‌లను ఉపసంహరించుకోలదని తెలిపారు. కాగా ఒక్కో పదవికి ఒక్క నామినేషనే దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు తెలిపారు. గ్రానైట్ పరిశ్రమల యజమానుల్లో కొందరు అసోషియేషన్‌కు ఎన్నికలు వద్దని, అందరి సహకారంతో ఎన్నిక ఏకగ్రీవం చేసుకుందామని తీర్మానించుకుని నూతన కమిటీని ఎన్నుకున్నట్లు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా తెడ్డు రమేష్, ఉపాధ్యక్షులుగా బోయిడి వెంకటరమణ, బోరెం నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోతుకూరి రామభద్రయ్య, సంయుక్త కార్యదర్శులుగా పోలూరి కృష్ణ, చాగంటి సందీప్, కోశాధికారిగా చాగంటి శ్రీకాంత్, కార్యనిర్వహణ సభ్యుడిగా వీరెల్లి సీతారామయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మిగిలిన ఐదు కార్యవర్గ సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదని తెలిపారు. త్వరలోనే ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ఇల్లెందురూరల్, మే23(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం రొంపేడు గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఇల్లెందు మండలం సర్వే తండా గామానికి చెందిన గంగావత్ మోహన్ ఖమ్మం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సొంత గ్రామంలో శుభాకార్యానికి భార్య లలితతో కలిసి తన ద్విచక్ర వాహనంపై వెళ్లివస్తుండగా రొంపేడు గ్రామ సమీపంలో ఇల్లెందు నుంచి కొమరారం వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం అతడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇరువురిని స్థానికులు ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం వైద్యశాలకు తరలించారు.

ఖమ్మం రైల్వేస్టేషన్‌లో వ్యక్తి హల్‌చల్


ఖమ్మం ఖానాపురంమవేలి మే 23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓ వ్యక్తి హల్‌చల్ చేయగా ఆ వ్యక్తిని ప్రాణాలతో కాపాడిన ఆర్ పీఎఫ్ సిఐ సురేష్‌గౌడ్, సిబ్బంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు లలిత్ బరిహ అనే వ్యక్తి రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పైనుంచి కిందకు దూకేందుకు ప్రయత్నించి కొంతసేపు హల్‌చల్ చేశాడని తెలిపారు. సకాలంలో స్పందించిన ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్‌గౌడ్ తన సిబ్బందితో పాటు ఫైర్ సిబ్బంది సహకారంతో బాధితుడిని సురక్షితంగా కాపాడారు. కుటుంబ కలహాల కారణంగానే ఇతను ఇలా ప్రవర్తించినట్లు తెలిపారు.

భార్య గొంతు కోసిన భర్త

లక్ష్మీదేవిపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అశోక్‌నగర్‌లో భార్యను గొంతుకోసి గాయపర్చిన సంఘటన గురువారం చోటుచేసుంది. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. వైరాలో ఉంటున్న భర్త మాధవరావు వేరే మహిళతో సంబంధం ఉందని, భర్తను వదిలి భార్య లావణ్య మండల పరిధిలోని అశోక్‌నగర్ గ్రామంలో గల తల్లిగారింటికి వచ్చింది. గురువారం తన అత్తంటికి వచ్చిన మాధవరావు భార్య లావణ్యతో గొడవపడి ఆమెను గొంతుపై కత్తితో గాయపర్చి పరారయ్యాడు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ-2 సింహారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యుడి చుట్టూ వలయం..

- అద్భుతమంటున్న కొందరు..
- భారీ వర్షాలకు సంకేతమంటున్న మరికొందరు
- సోషల్ మీడియా వేదికగా విస్తృత చర్చ



కొత్తగూడెం అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో అద్భుతాలు, ఆశ్చర్య కర దృశ్యాలకు వేదికైన అంతరిక్షంలో నిత్యం ఎక్కడో ఒక చోట అద్భుతం ఆవిష్కృతమవుతూనే ఉంటుంది. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో సూర్యుడి చుట్టూ ఇంద్రధనస్సు మాదిరిగా ఏర్పడిన వలయం ఆకట్టుకుంది. కానీ దీనిపై సోషల్ మీడియా వేదికగా విస్తృత చర్చ జరుగుతోంది. ఇలాంటి వలయాలు ఏర్పడం సాధారణమేనని, వీటిని 22డిగ్రీల వృత్తాకార వలయాలని పేర్కొంటారని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వాతావరణంలో ఉండే నీటి బిందువుల నుంచి కాంతి తరంగాలు ప్రయాణించినప్పుడు కాంతి విక్షేపణం (స్కాటరింగ్) చెంది ఇలాంటి వలయాలు ఏర్పడతాయని వారు వివరిస్తున్నారు. జోతిష్య పండితులు, సిద్ధాంతులు మాత్రం ఈ వలయాన్ని పరివేషం అంటారని చెబుతున్నారు. సంహిత గ్రంథాల్లో కూడా దీనిపై రాసి ఉందని, ఈ వలయం లక్షణాలను బట్టి చూస్తే రానున్న రెండు, మూడు రోజుల్లో భారీనుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని పండితులు చెబు తున్నట్టు స్థానిక సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.



నేడు మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం, మే23 (ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం మండలంలోని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం పర్యటించనున్నట్టు ఆయన క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులక శంకుస్థాపన చేస్తారని తెలిపారు. రూ.3.75కోట్లతో రాకాసితండా బీటీ రోడ్డు నిర్మాణంకు శంకుస్థాపన, పాతర్లపాడునుంచి హైదరసాయిపేట వరకు రూ.25కోట్లతో చేపడుతున్న బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన, తిరుమలాయపాలెం నుంచి తెట్టెలపాడు వరకు రూ.33కోట్లతో బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు.

గ్రేడ్-2 కార్యదర్శికి సన్మానం



సృజన్‌బాబును సన్మానిస్తున్న మార్కెట్ చైర్మన్ హన్మంతరావు

ఖమ్మం మార్కెట్, మే 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గ్రేడ్-2 సెక్రెటరీగా విధులు నిర్వర్తిస్తూ గ్రేడ్‌వన్ సెక్రెటరీగా పదోన్నతి పొందిన వద్దిరాజు సృజన్‌బాబును శుక్రవారం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఇటీవల సృజన్‌బాబును మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్ మార్కెట్‌కు సెక్రెటరీగా ఇటీవలే బదిలీ చేయగా ఆయన శుక్రవారం ఖమ్మం మార్కెట్ విధుల నుంచి రిలీవ్ అయ్యారు. కార్యక్రమంలో డీఎంవో అలీం, మార్కెట్ అసిస్టెంట్ సెక్రెటరీ వీరాంజనేయులు, సిబ్బంది రెంటాల ప్రసాద్, కొమ్మినేని వెంకటేశ్వర్లు ఉన్నారు.

పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి

తిరుమలాయపాలెం, మే23(ఆంధ్రజ్యోతి) పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని టీడీపీ మండల నాయకుడు కొప్పుల వెంకటరావు తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీతో సంబంధం లేకుండా పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో మల్లిడి రమేష్, భాగ్యమ్మ, నాగేశ్వరరావు, వీరయ్య, పాల్గొన్నారు.



రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా సంక్షేమ పథకాల్లో ఎంతో కీలకమైన చేయూత పింఛన్‌దారుల నిరీక్షణ మాత్రం తప్పటం లేదు. కొత్త ప్రభుత్వంలో సైతం ఏడాదిన్నరగా కొత్త పింఛన్లు ఇవ్వకపోడంతో దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, వితంతువులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితులు నిరీక్షిస్తున్నారు.





చేయూత ఏదీ?

- 2022 ఆగస్టు నుంచి మంజూరు కాని కొత్త పింఛన్లు
- ఆరు గ్యారెంటీల్లో అమలు కాని చేయూత
- భర్త మరణించిన మహిళలకే పింఛన్ మార్పిడి అమలు
- జిల్లాలో 14,653 మంది చేయూత కోసం నిరీక్షణ

ఖమ్మం సంక్షేమవిభాగం, ఆంధ్రజ్యోతి, మే 23: 2022 ఆగస్టు తర్వాత కొత్త పింఛన్లు మంజూరు కాకపోవటంతో మూడేళ్లుగా సదరమ్ ధ్రువపత్రాలు పొందిన వారు పింఛన్‌లు తీసుకోకుండానే ఆ పత్రాల గడువు ముగిసింది. మరెందరో పింఛన్లు తీసుకోకుండానే కన్నుమూశారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, వితంతువులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ చేయించుకునే వారికి ప్రభుత్వం పింఛన్ కల్పిస్తోంది. గత ప్రభుత్వంలో ఈ పథకాన్ని ఆసరాగా పిలువగా, ప్రస్తుత సర్కారు చేయూతగా మార్చింది. మూడేళ్లుగా జిల్లాలో నూతన పింఛన్లు ఇవ్వకపోవడంతో ఎంపీడీవో కార్యాలయాల్లోనే దరఖాస్తులు మూలుగుతున్నాయి.

నెలకు రూ.42 కోట్లు చేయూత

ఖమ్మం జిల్లాలో ప్రభుత్వం తొమ్మిది రకాల లబ్ధిదారులకు 1,85,202 మందికి చేయూత పింఛన్ ఇస్తున్నారు. వీరిలో వృద్ధులు 70,649 మంది, వితంతువులు 70,565, దివ్యాంగులు 27,883, గీత కార్మికులు 3,149, చేనేత 430, హెచ్ఐవీ బాధితులు 2541, డయాలసిస్ 129, ఫైలేరియా 1,393, బీడీ కార్మికులు 2, ఒంటరి మహిళలు 8,461 మంది ఆసరా లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వం ప్రతీ నెల ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.42.91 కోట్లు జమ చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి నాళ్లలో ప్రతీ నెల అర్హత కలిగిన వారిని క్రమపద్ధతిలో ఎంపిక చేస్తూ నూతనంగా మంజూరు చేస్తూ వచ్చింది. తర్వాత కాలంలో ఆర్థిక ఇబ్బందులతో బడ్జెట్ మంజూరు కావటం లేదని లబ్ధిదారులను ఎంపికను నిలిపివేసింది. తర్వాత 2019జూన్‌లో నూతన పింఛన్లు అందిస్తామని ప్రకటించి అప్పటి వరకు ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న వాటిలో అర్హత కలిగిన వారికి నూతన పింఛన్లు మంజూరు చేశారు. తర్వాత 2022 ఆగస్టు నుంచి నూతన పింఛన్లు మంజూరును నిలిపివేశారు. కేవలం కుటుంబంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే భార్యకు, భార్య మరణించిన కుటుంబంలో భర్తకు మాత్రమే పింఛన్ బదలాయింపు చేస్తూ ఇన్‌స్టెంట్ పింఛన్‌ను అందిస్తున్నారు.

14,653 మంది చేయూత కోసం నిరీక్షణ

జిల్లాలోని మునిసిపాలిటీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో సేకరించిన పింఛన్ల దరఖాస్తులను ఇటీవల జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా 14,653 మంది ఇప్పటి వరకు దరఖాస్తులు చేసినట్లు గుర్తించారు. వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రభుత్వం ఏ క్షణాన అయినా చేయూత పథకంలో నూతన పింఛన్లు మంజూరు ప్రకటన చేసినా వివరాలను అందించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు సిద్ధం చేశారు.

నగరంలో మంత్రి తుమ్మల విస్తృత పర్యటన



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విస్తృతంగా పర్యటించారు. శుక్రవారం గాంధీచౌక్‌లో జరిగిన శంకర్‌నాయక్ కుమార్తె వివాహంలో మంత్రి తుమ్మల పాల్గొని వధూరులను ఆశీర్వదించారు. చింతకాని మండలం కొదుమూరులో బడేసాహెబ్ కుమారుడువివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన దంపతులను ఆశీర్వదించారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్క్ ఫలితాల్లో కృష్ణవేణి ఐఐటీ మెడికల్ అకాడమీ విజయకేతనం



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 23(ఆంధ్రజ్యోతి): బీఆర్క్, బీ ప్లానింగ్-25 ఫలితాల్లో నగరంలోని కృష్ణవేణి ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలకు చెందిన పీ. మణిచంద్రసాయి 95, టి. తరుణ్ 242, ఎస్‌కే. సమద్ 369, ఎస్. ధనుస్ 1027, బి. చక్రవర్తి 1059, ఆర్. గుప్తాశ్రీ 1137, జె. జస్వంత్ 1020, జి. వినీత 1266, డి. మహేశ్వర్ 1308, కె. అబిషేక్ 1420, బి. రాహుల్ 1521, బి. రోహిత్ గని 1884, టి. గణేష్ 2189, టి. డిన్నీ 2190, వి. సాత్విక 2230, డి. రాజేశ్వరి 2410, ఎన్. నేహిత 2583, పి. యశస్వి 2664, డి. సింధు 3081, జి. సాహిత్ 3259, కె. మహేష్‌బాబు 3301, కె. మౌనిక 3396, బి. శ్రీసిరి 3406 తోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, డీన్ ఏలూరి వంశీకృష్ణ పాల్గొన్నారు.

సబ్ జూనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక



పరుగు పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీ నుంచి సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్న జిల్లా సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ జట్లను శుక్రవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికల్లో భాగంగా అండర్- 8, 10, 12 బాలురు, బాలికలకు పరుగు పోటీతో పాటు లాంగ్‌జంప్, షాట్‌పుట్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 124 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండీ షఫీక్‌అహ్మద్ ప్రకటించారు. ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ సంఘ బాధ్యులు వెంకటేశ్వర్లు, సుధాకర్, రవి, క్రిష్ణయ్య, ముజాహిద్, హలీం, నవీద్, ప్రియాంక, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ తదితరులు సమీక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలి

- వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిర్వహించాలి
- ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి



ఉపాధ్యాయ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న పారుపల్లి

నేలకొండపల్లి, మే23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, తద్వారా ప్రభుత్వ బడులను బలోపేతం చేయటం ద్వారా విద్యా వ్యవసను రక్షించుకుందామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదును పెంచే లక్ష్యంతో ఈనెల 25నుంచి 31వరకు రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన బడిబాట జీపుజాతాలో ప్ర భుత్వ ఉపాధ్యాయులందరూ పాల్గొని నమోదును పెంచే దిశగా కృషి చేయాలన్నారు. పాఠశాలలు తెరిచే సమయానికే వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రిను పూర్తి చేసి విద్యా సంవత్సరానికి ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కోరారు. శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు బోధించాలని, విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యను అందించటానికి ఇటువంటి శిక్షణా తరగతులను ఉపయోగించుకోవాలని పారుపల్లి నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు జె. జ్యోతి, తొర్తి గురవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, కోశాధికారి రాంబాబు, కార్యదర్శి సురేష్, మండల కార్యదర్శులు అరుణ, నాసరయ్య, కరుణశ్రీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్క్‌లో మెరిసిన రెజోనెన్స్



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 23(ఆంధ్రజ్యోతి): బీఆర్క్, బీ ప్లానింగ్ 2025 ఫలితాల్లో నగరంలోని రెజోనెన్స్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్ర కుమార్, కొండా. శ్రీధర్‌రావు తెలిపారు. వివిధ కేటగిరిలలో కళాశాలకు చెందిన కార్తికేయ ఆల్ ఇండియా 2వ ర్యాంక్ సాధించాడని తెలిపారు. భవగ్న 829, బి. రాకేష్ 997, దివ్యతేజ 1163, ధ్రువ 1173, మణికుమార్ 1400, వేదాంత్ 1500, శివాణి 1740, ధ్యానదీప్ 2170, భగవతి 2586, నిహారిక 3080 తోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



జల కళతో తొణికిసలాడుతున్న మస్తాన్ కుంట చెరువు



పంట కాల్వ పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



చెర్వుకొమ్ము తండాలో సిద్ధమైన పంట కాల్వ

చెరువులకు జల కళ

- మంచుకొండ ఎత్తిపోతల పథకంతో నిండుకుండల్లా నీటివనరులు
- ఉపాధి పనులతో సిద్ధమవుతున్న పంట కాల్వలు
- మంత్రి తుమ్మల చొరవతో తీరుతున్న సాగునీటి కష్టాలు

రఘునాథపాలెం, మే 23(ఆంధ్రజ్యోతి): వరుణుడిపైనో, బావుల్లో నీటిపైనో ఆధారపడి సాగు చేసే రఘునాథపాలెం మండలంలో మండే ఎండల్లోను చెరువులు జలకళతో తొణికిసలాడుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అపర భగీరథుడిలా కేవలం మూడు నెలల కాలంలోనే మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసి కాల్వలు తీయించి నాగార్జున సాగర్ జలాలను రఘునాథపాలెం మండలంలోని 36 చెరువుల్లోకి పారించారు. దీంతో దశల వారీగా మండలంలోని చెరువులు జలకళ సంతరించుకున్నాయి. మరో వైపు జాతీయ ఉపాధి హామీ పథకంతో ఉపాధి కూలీలు పంట కాల్వ పనులు చేపడుతున్నారు. దీంతో రైతులకు సాగునీటి కష్టాలు తొలిగినట్లే అని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలోని మస్తాన్ కుంట చెర్వు నీటి కల, చెర్వు కొమ్ముతండాలో పంట కాల్వల పనులను 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

సెంచరీ కొట్టిన తాతయ్య..

ఘనంగా వందో పుట్టిన రోజు వేడుక



వంద సంవత్సరాల వేడుకలో సూర్యనారాయణ

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 3వ డివిజన్ జయనగర్ కాలనీకి చెందిన మండడపు సూర్యనారాయణ 100వ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం జయనగర్ కాలనీలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఆయన కుమారులు, కోడళ్లు, మనుమళ్లు, మనుమరాళ్లు అందరూ కలిసి వసంతోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. బంధువులను, స్నేహితులను పిలిచి వేడుక నిర్వహించారు. వంద సంవత్సరాలు వచ్చిన సూర్యనారాయణ నేటికి తన పని తానే చేసుకుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయణ్ను ఘనంగా సన్మానించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు, రాధాకిషన్‌రావు, భాస్కరావు, ప్రతాప్, భారతి, హైమావతి, సత్యవతి, ఇందు ప్రియ, మోక్షజ్ఞ, విశ్వక్, ఉమ, పూజిత తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సానుభూతిపరురాలి మృతి

ఖమ్మం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డుకు చెందిన సీపీఐ సానుభూతిపరురాలు ఆడెపు చిట్టెమ్మ(74) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తిపరిచారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దండి రంగారావు, సురేందర్, రాము, వరుణ్ తేజ్, దేవయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు

నేలకొండపల్లి, మే23 (ఆంధ్రజ్యోతి): అతి పురాతనమైన నేలకొండపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానానికి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న భూములకు కౌలు బహిరంగ వేలం శుక్రవారం దేవాలయం ప్రాంగణంలో నిర్వహించారు. స్వామివారి భూములను మొత్తం ఎనిమిది బిట్లుగా విభజించి బహిరంగ వేలం నిర్వహించగా, మూడు బిట్లకు సరైన వేలం పలకక పోవటంతో వాయిదా వేశారు. ఐదు బిట్లకు గాను రూ.8.79లక్షలు పాడారు. గత సంవత్సరం రూ.7.92లక్షలు మాత్రమే రాగా ప్రస్తుతం రూ.87,600 పెరిగింది. వాయిదా పడిన బిట్లకు ఈనెల 28న తిరిగి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ప్రకటించారు.

నాయీ బ్రాహ్మణులకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఖమ్మం చర్చికాంపౌండ్, మే23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు శుక్రవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈమేరకు ఖమ్మం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు యలమందల జగదీష్ నగరంలోని సెలూన్లలో పనిచేస్తున్న వారికి గుర్తింపు కార్డులు పంపిణీచేశారు. జగదీష్ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు గుర్తింపు కార్డులు అందించడం వల్ల సంఘసభ్యుడిగా వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు.



తహసీల్దార్ సైదులును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అర్బన్ తహసీల్దార్‌ను కలిసిన బీజేపీ నాయకులు

ఖమ్మం స్పోర్ట్స్, మే 23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన దొడ్డారపు సైదులును శుక్రవారం జిల్లా బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మరింత సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు కుమిలి శ్రీనివాసరావు, వాకదాని రామక్రిష్ణ, కంపసాటి అంజన్న, ఏపూరి నాగేశ్వరరావు, కందుల శ్రీక్రిష్ణ, హుస్సేన్, రాము, సీతారాములు తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాల ఏడీగా రఘు బాధ్యతల స్వీకరణ



రఘుకుమార్‌ను అభినందిస్తున్న సహోద్యోగులు

ఖమ్మం కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఏడీగా సామినేని రఘుకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటి వరకు మహబూబాబాద్ వైద్య కళాశాలలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తుండగా ప్రభుత్వం పదోన్నతిని కల్పిస్తూ ఖమ్మం మెడికల్ కళాశాలకు ఏడీగా నియమించింది. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రఘును టీఎన్జీవో నాయకులు నందగిరి శ్రీను, ఆర్వీఎస్ సాగర్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఏడీ సంతోష్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికిశోర్, వరంగల్ ఎంజీఎం ఏవో రమేష్ తదితరులు అభినందించారు.

మధిరలో రెవెన్యూ మంత్రి పొంగులేటి పర్యటన

మధిరటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారం మధిరలో పర్యటించారు. మొదటగా రెడ్డి గార్డెన్స్‌లో జరుగుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు జయరాజు కూతురు వివాహానికి హజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం సాయినగర్‌లో కాంగ్రెస్ కార్యకర్త సాయిప్రణీత్ వివాహనికి హజరై ఆశీర్వదించారు. అనంతరం అనారోగ్యంతో బాదపడుతున్న కాంగ్రెస్ నాయకుడు యన్నం కోటేశ్వరరావు తల్లి తండ్రులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డా. కోట రాంబాబు, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, విశెట్టి రంగారావు, సీతరాంరెడ్డి, యర్రగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశరక్షణే ఎన్‌సీసీ లక్ష్యం



ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన వీరచక్ర అవార్డు గ్రహీత కల్నల్ సచిన్ అన్నారావు

వైరా, మే 23 (ఆంధ్రజ్యోతి): దేశరక్షణే ఎన్‌సీసీ స్థాపన లక్ష్యమని వీరచక్ర అవార్డు గ్రహీత, వీఆర్‌సీ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావు అన్నారు. వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ సెంబాల్ కర్ క్యాంపును శుక్రవారం సచిన్ అన్నారావు సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అన్నారావు మాట్లాడుతూ.. సంఘజీవతత్వం, స్వచ్ఛభారత్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలపై ఎన్‌సీసీ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కే.భద్ర, ఏవో కల్నల్ నవీన్ యాదవ్, న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ఏఎన్‌వో థర్డ్ ఆఫీసర్ సీహెచ్.అపురూపదేవి పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ యూత్ కమిటీ ఎన్నిక

వైరా, మే 23 (ఆంధ్రజ్యోతి): వైరా మున్సిపాలిటీ పరిధిలో నాయీబ్రాహ్మణ యూత్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యలమందల అశోక్, ఉపాధ్యక్షుడిగా సాంబ, కార్యదర్శిగా ఎర్రనాగుల సతీష్, కోశాధికారిగా మంచికంటి శంకర్, జాయింట్ సెక్రటరీగా జంపాల ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా కుదురుపాక శ్రీకాంత్, జి.గోపి, వెదురుపాక నాగరాజు, కొంగర సత్యనారాయణ, మంచికంటి నరేష్, ఎర్రనాగులు వెంకటకృష్ణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి

తల్లాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధికంగా విద్యార్థులను చేర్పించేందుక కృషిచేయాలని డీఈవో సామినేని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరాన్ని ప్రభుత్వం ఎన్‌రోల్‌మెంట్ ఇయర్ గా ప్రకటించిన దృష్ట్యా బడిబాట కార్యక్రమాన్ని గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు సహకారంతో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్.దామోదరప్రసాద్, ఎంఎన్‌వో పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలి

ముదిగొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ రామనాథం పిలుపునిచ్చారు. శుక్రవారం ముదిగొండ మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో టీడీపీ పుంజుకుంటోందని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం టీడీపీ మండల కమిటీతోపాటు పలు గ్రామాలకు గ్రామశాఖ కమిటీలను ఏర్పాటుచేసుకున్నారు. ముదిగొండ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కనపర్తి వీరబాబు, సురేష్‌తోపాటు ఎనిమిదిమందితో కూడిన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీతయ్య, సత్యనారాయణ, రామయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సిందూర్‌కు మద్దతుగా పెనుబల్లిలో ర్యాలీ



పెనుబల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుబల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో మతోన్మాదులు జరిపిన హత్యాకాండలో బలైన టూరిస్టులకు నివాళులర్పిస్తూ ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శుక్రవారం పెనుబల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎంబంజర్‌లో అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి రింగ్‌సెంటర్ మీదుగా కోదండ రామాలయం వరకు స్వచ్ఛందంగా మహిళలు జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల వ్యవస్థను నిర్మూలించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, ఈవీ.రమేష్, బొర్రా నర్సింహారావు, వంగా గిరిజాపతిరావు, నాగబండి ప్రభాకర్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఏకరూప దుస్తులు



కుట్టుపనులు పరిశీలిస్తున్న డీఈవో సత్యనారాయణ

ఏన్కూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్టు డీఈవో ఎస్.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఏన్కూరులోని ఏకరూప దుస్తుల కుట్టు పనులను పరిశీలించారు. పాఠ్యపుస్తకాలను కూడా పంపిణీకి సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు. వీరివెంట ఎంఈవో రహీంబీ, కాంప్లెక్స్ హెచ్‌ఎం కూరాకుల సైదయ్య, హెచ్‌ఎం నాగేశ్వరరావు, మోతిలాల్, జయ, హథిరాం తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరి సుశీల మృతికి సంతాపం

ఎర్రుపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ కొమ్మూరి కృష్ణయ్య భార్య సుశీల శుక్రవారం మరణించారు. దీంతో విషయం తెలుసుకున్న ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. సుశీల కుమారడు బీఆర్‌ఎస్ నాయకడు మాజీ సర్పంచ కొమ్మూరి గోపాలరావుతతో ఫోన్‌లో మాట్లాడి విచారం వ్యక్తంచేశారు. ఆమె కుటుంబానిక తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీ రఘురామిరెడ్డి
- పదేళ్ల తరువాత పేదలకు పక్కా ఇళ్లు: ఎమ్మెల్యే

సత్తుపల్లి/వేంసూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం జరుగుతుందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు. శుక్రవారం సత్తుపల్లి, వేంసూరులలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు చేసిన న్యాయం ఏమీ లేదని విమర్శించారు. కూలిపోయే కాళేశ్వరం కట్టడం, దరిద్రపు ధరణి, రైతు బంధు మినహా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. బీఆర్‌ఎస్ చేసిన రూ.7లక్షల కోట్లు అప్పును కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుస్తున్నారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నాలుగున్నర లక్షలు మంజూరు చేశారని, 200 యూనిట్లలోపు గృహ విద్యుత్‌కు వినియోగానికి జీరో బిల్లు, రూ.500లకే వంట గ్యాస్. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, రైతులకు రూ.21వేల కోట్ల రుణ మాఫీ జరిగిందని, సన్నరకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ రఘురామిరెడ్డి

వడ్లకు ప్రభుత్వం బోనస్ ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. సుదీర్ఘకాలం తరువాత మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు సకాలంలో నిర్మించుకోవాలని సూచించారు.

పేదలకు పదేళ్ల తరువాత ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే

రాష్ట్రంలో పదేళ్ల తరువాత పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేదల అవసరాలకు అనుగణంగా నిర్మించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలలకే రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు చొప్పున మంజూరు చేశామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అక్కసుతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వారి ఆరోపణలను తిప్పికొట్టాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంబేద్కర్ భవన్ ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా మంజూరు మాత్రమే చేశారని, ఆయా పనులకు తమ హయాంలో నిధులు కేటాయించినట్లు చెప్పారు. రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ కాంగ్రెస్ ఘనతేనని అన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని, పారదర్శకంగా ఇళ్ల మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్ నరసింహా, తహసీల్దార్ సత్యనారాయణ, సత్తుపల్లి, వేంసూరు ఎంపీడీవోలు నాగేశ్వరరావు, రాజారావులు పాల్గొన్నారు.

పెనుబల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికి ఇందిరమ్మ గృహాలను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. పెనుబల్లిలో శుక్రవారం జరిగిన ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు మంజూరి పత్రాలు అందజేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకార, సూచనలతో సత్తుపల్లి నియోజకవర్గానికి 3500ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో మరో వెయ్యి ఇళ్లు కూడా మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్, ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ రమేష్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్‌చౌదరి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, కరీముల్లా, కీసర శ్రీనివాసరెడ్డి, సీతరామయ్య పాల్గొన్నారు.



పెనుబల్లిలో మంజూరుపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

దుకాణాలను సీజ్ చేసిన మునిసిపల్ సిబ్బంది



దుకాణానికి సీల్ వేస్తున్న మునిసిపల్ అధికారులు

వైరా, మే 23 (ఆంధ్రజ్యోతి): వైరా మున్సిపాలిటీ పరిధిలోని గాంధీచౌక్‌లో దాదాపు రెండు సంవత్సరాల నుంచి అద్దెలు చెల్లించని షాపులను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ సిబ్బంది ఈ షాపులకు సీల్ వేశారు. గాంధీచౌక్‌లోని మున్సిపాలిటీకి చెందిన షాపుల్లో వ్యాపార లావాదేవీలు నిర్వహించుకుంటున్న వ్యాపారులు వేలాదిరూపాయల అద్దె మొత్తాన్ని చెల్లించడం లేదు. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో కమిషనర్ చింతా వేణు ఆదేశాల మేరకు సిబ్బంది సీజ్ చేసి షట్టర్లకు సీల్ వేశారు.

మండలంలో సండ్ర పర్యటన

తల్లాడ, మే 23 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో శుక్రవారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో నవదంపతులు కాంపల్లి అజయ్, మానస, బిల్లుపాడులో వేమా ఉపేందర్,లక్ష్మి, నూతకల్‌లో నాయుడునరేస్ దంపతులను ఆయన ఆశీర్వదించారు. మాజీ ఎంపీపీ దొడ్డశ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి వెంకట్‌లాల్, ,మాజీ ఎంపీటీసీ బ్రహ్మం, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి

బోనకల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ డిమాండ్ చేశారు. బోనకల్‌లో శుక్రవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానమే వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం విద్యార్థుల నమోదును పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్‌ను వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయమై స్పందించకుంటే ఉపాధ్యాయ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తాయని ఆయన అన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రంగారావు, నాయకులు సదాబాబు, గోపాలరావు, నర్సింహారావు, కోటయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల రహదారి పనులకు శ్రీకారం

కల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో తలపెట్టిన యంగ్ ఇండియా పాఠశాల రహదారి పనులకు ప్రభుత్వం తరుపున శుక్రవారం శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో తలపెట్టిన యంగ్ ఇండియా పాఠశాలను మండలంలోని చెన్నూరును ఎంపిక చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం తరుపున ఇప్పటికే భవనాల నిర్మాణానికి 22 ఎకరాల స్థలాన్ని కూడ రెవెన్యూశాఖ తరుపున సేకరించారు. దీంతో పాఠశాల భవనాలు, మౌలిక వసతుల కల్పనకు గానూ ప్రభుత్వం రూ200 కోట్లు కేటాయించనున్నది. దీంతో



రహదారి పనులకు పూజ చేస్తున్న రెవెన్యూ అధికారి సుజాత

పాఠశాల నిర్మాణ స్థల ప్రదేశానికి సులువైన విధంగా రహదారి మార్గాన్ని ఏర్పాటు చేసేలా స్థానికంగా పలు రాజకీయ పార్టీల నాయకులు సమిష్టిగా ముందుకు వచ్చారు. ఈ పాఠశాల మంజూరులో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్‌ల సహకారం ఎంతో ఉంది. కాగా ఈ రహదారి పనులకు గాను రెవెన్యూశాఖ తరుపున ఆర్‌ఐ సుజాతతో పాటుగా స్థానిక ప్రముఖులు కలిసి భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం నాయకులు పసుమర్తి మోహన్‌రావు, మాదాల గోపాలరావు, రామకృష్ణ, జమలయ్య, కేవి, మాదాల వెంటేశ్వరరావు, మండవ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన అదనపు డీసీపీ

వైరా, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు సమీపంలో ఉన్న చెక్‌పోస్ట్‌ను శుక్రవారం అడిషనల్ డీసీపీ(శాంతిభద్రతలు) ప్రసాదరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువుల అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పశువుల రవాణా విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువులను రవాణా చేసే ప్రతి వాహనానికి తగిన నిర్ధారిత ప్రామాణిక పత్రాలు, నియమనిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పశువుల అక్రమ రవాణా వాహనాలను పోలీసులు మినహా ఏ సంస్థలు, కార్యకర్తలు స్వయంగా ఆపకూడదని, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే పరిష్కారానికి పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారని వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా మతసామరస్యంతో జరుపుకునేలా అవసరమైన చోట్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు.



పాలడుగులో చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాదరావు



చేతిపంపును ప్రారంభిస్తున్న ఎస్ఐ వెంకన్న

చొప్పకట్లపాలెంలో చేతిపంపు ప్రారంభం

బోనకల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో శుక్రవారం హోప్ చారిటబుల్ సొసైటీ ఖమ్మం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతిపంపును ఎస్ఐ పి.వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని సూచించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు గానూ చేతిపంపును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎర్నెస్ట్‌పాల్, మాజీ సర్పంచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడితో యువ నాయకుడు

పెనుబల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్‌కుమార్ గౌడ్‌తోపాటు రాజ్యసభసభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్‌ను శుక్రవారం గాంధీభవన్‌లో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి మనోహర్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మనోహర్‌కు మహేష్‌కుమార్‌గౌడ్ ఫోన్ చేసి పరామర్శించారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత గాంధీభవన్‌కు రావాలని తెలపగా శుక్రవారం నాయుడు ఆయనను కలిశారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. నాయుడు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

శుభ కార్యాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి



జమలాపురంలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి పొంగులేటి

ఎర్రుపాలెం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుభకార్యాక్రమాల్లో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఎర్రుపాలెంలో అయిలూరి అజయ్‌కుమార్‌రెడ్డి, నవ్య వివాహవేడుకలో పాల్గొని నూతనవధూవరులను ఆశీర్వదించారు. జమలాపుంర బాలాజీభవన్‌లో కాంగ్రెస్ నాయకుడు యర్రంరెడ్డి నాగేశ్వరరెడ్డి కుమారుడు శివరాంరెడ్డి వివాహంకు హాజరై వధూవరులకు పట్టు వస్త్రాలు అందించారు. అనంతరం జమలాపురంలో ఇటీవల అనారోగ్యంతో ఆపరేషన్ అయిన కాపర్తి శ్రీనివాసాచారి, ముల్లంగి గాబ్రియేల్‌ను పరామర్శించి ఆర్థికసహాయం అందించారు. ఈ కార్యక్రమలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, అయిలూరి వెంకటేశ్వరెడ్డి, అంకసాల శ్రీనివాసరావు, అనుమోలు కృష్ణారావు, మూల్పూరి శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు వై.వీ

బోనకల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని రావినూతల గ్రామంలో శుక్రవారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు జరుగుతాయని తెలిపారు. బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచి ప్రభుత్వ బడులను పరిరక్షించుకునేందుకు ఉపాధ్యాయులు ముందుకు సాగాలని సూచించారు. పెండింగ్ డీఏలు, మెరుగైన పీఆర్సీ సాధన కొరకు నిర్వహించే జేఏసీ పోరాటాలలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో పీఆర్టీయు జిల్లా, మండల నాయకులు మోతుక్కూరి మధు, రత్నాకర్, రెబ్బా శ్రీనివాసరావు, కొమ్ము శ్రీనివాసరావు, సిహెచ్. రవి కుమార్, కె. రామ్మోహన్, ఎం. వెంకటేశ్వరరావు, జి. నాగేశ్వరరావు, టి. స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యలమద్ది వెంకటేశ్వర్లు

30న జరగే ధర్నాను జయప్రదం చేయండి

కారేపల్లి మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం ఈనెల 30న కలెక్టరెట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాణిక్యారంలో ఉపాధికూలీలతో ఆయన మాట్లాడుతూ.. కూలీలకు రెండు వందల దినాలు కూలీపని కల్పించి, రోజు కూలీ రూ.ఆరు వందలు చెలించాలన్నారు. కొలతల పద్దతిని రద్దుచేయాలన్నారు. పని ప్రదేశంలో వసతులు కల్పించాలని, కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు భర్తీచేయలన్నారు. నెలనెల వేతానాలు చెల్లించలన్నారు. మండలంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపచేసి ఇల్లు లేని పేదలందరికి ఇండ్లు మంజూరుచేయాలన్నారు. కలెక్టరేట్ ధర్నాలో ఉపాధికూలీలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యాక్రమాన్ని విజయవంతచేయాలని నాగేశ్వరరావు కోరారు. మహిళానాయకురాలు కొండబోయిన ఉమావతి, ఎడ్లపల్లి సైదులు, డేగాటి గోపాల్, పోతర్ల నాగేశ్వరరావు, వడ్డూరి వీరబాబు, పుల్లమ్మ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధికూలీలతో మాట్లాడుతున్న కొండబోయిన నాగేశ్వరరావు

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

మధిరరూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బంగారు నాగరాజు కోరారు. మధిరలో సీపీఎస్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతుల సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ తరగతులు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి దోహదం చేస్తాయని అదేవిధంగా టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలోరాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 25నుండి 31వరకు జరిగే ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విలీనంపై పునరాలోచన చేసి పంచాయతీకి ఒక పాఠశాల ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు పెండింగ్‌లోని 5 డీఏలను, పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ కోశాధికారి బైర్ల చెన్నయ్య, ఎఫ్‌డబ్ల్యుఎఫ్ కన్వీనర్ మల్లరాజు, ఎంఈ రఫీ, దారిశెట్టి మహేందర్‌కుమార్, రమేష్‌బాబు, జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకుడు నాగరాజు